క్లుప్తంగా

మంత్రి పొన్నం శంకుస్థాపనలు



ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి పొన్నం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన లంబాడి తండాల్లో రోడ్డు నిర్మాణాలు పూర్తిచేసే ప్రక్రియలో భాగంగా శంకుస్థాపనులు, ప్రారంభోత్సవాలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాలువను పరిశీలించిన డీఈ



తూమును పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్‌రావు

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరుకు కూడవెల్లి వాగు నుంచి వెళ్లే కాలువను డీఈ చెన్ను శ్రీనివాస్‌రావు ఆదివారం పరిశీలించారు. మంత్రి కొండా సురేఖ శనివారం మల్లన్నసాగర్ నుంచి సాగునీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాలువ పూడికతో నిండిపోయిందని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకుపోయారు. దీంతో మంత్రి వెంటనే స్పందించి కాలువను పరిశీలించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీఈ కాలువను పరిశీలించారు. రెండు రోజుల్లోగా పూడికను తీసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.75వేల ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న యాదగిరి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి చెందిన పిట్టల కరుణాకర్ వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి స్థానిక ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.75వేల ఎల్‌ఓసీని ఆదివారం మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సిద్దులు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గదరాజు చందు, నాయకులు సత్యనారాయణ, కనకయ్య, ఆనందం, నర్సింహులు, బాలనర్సయ్య, అంజయ్య, కుమార్, భిక్షపతి, బాలరాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పూజలు



మల్లన్న సన్నిధిలో రాజశేఖర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామిని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేకర్ రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు


సిద్దిపేటఅర్బన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పొన్నాలలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. జిజ్ఞాన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ స్వప్న నేతృత్వంలో విద్యార్థులు నానో యూరియా ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. 50 కిలోల యూరియా బస్తాకి అరలీటర్ నానో యూరియా సమానమని, నానో యూరియా మైక్రాన్స్‌లలో ఉండి పంటలపై పిచికారీ చేసినపుడు పత్రరంధ్రాల ద్వారా త్వరగా చేరి మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుందని వివరించారు.

నిధులు రాక.. నిర్వహణ లేక

గత ప్రభుత్వ హయాంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన పేదలు వేడుకలు జరుపుకునేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి సామాజిక భవనాలను నిర్మించారు. అందులో భాగంగా మైనారిటీలకు షాదీఖానాలను మంజూరు చేశారు. వాటిలో కొన్ని పూర్తిచేయగా.. మరికొన్ని నిధుల కొరతతో నేటికీ అసంపూర్తిగా మిగిలాయి.

మూతపడిన షాదీఖానా

- ఐదేళ్లుగా.. అసంపూర్తిగానే..
- పట్టించుకునే నాథుడు కరువు
- చెదలు పట్టిన తలుపులు
- మందుబాబులకు అడ్డాగా..



విరిగిన తలుపులు.. అస్తవ్యస్తంగా పరిసరాలు



దుబ్బాకలో మూతపడ్డ షాదీఖానా



పగిలిన కిటికీ అద్దాలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో మైనారిటీ సంక్షేమ నిధులతో నిర్మించిన షాదీఖానలో ఒకటి పూర్తయినా నిర్వాహణ కొరవడి అధ్వానంగా మారింది. మరొకటి నిధుల లేమితో ఐదేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తుంది.

రూ.22.5లక్షలతో నిర్మాణం

దుబ్బాకలో దుంపలపల్లికి వెళ్లే ప్రధానదారిలో మైనారిటీ సంక్షేమ నిధులు రూ.22.5లక్షలతో షాదీఖానా నిర్మించించారు. దానిని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి 2012, అక్టోబర్‌లో ప్రారంభించారు. అనంతరం నిర్వహణను స్థానిక మసీదు కమిటీకి అప్పగించారు. అందులో ఎవరైనా అద్దె చెల్లించి శుభకార్యాలు జరుపుకొనే వీలుకల్పించారు. కొన్నాళ్లపాటు పెళ్లిళ్లు, ఇతర వేడుకలు నిర్వహించుకొన్నప్పటికీ ఐదేళ్లుగా ఖాళీగానే ఉంటోంది. పట్టించుకునే నాథుడు లేక మూతపడింది. తలుపులు విరిగి, కిటికీల అద్దాలు పగిలిపోయాయి. కొన్ని ద్వారాలకు చెదలు పట్టాయి. పశువులను కట్టేసి ఉంచడంతో ఆవరణ అంతా పశువుల పేడతో నిండిపోయింది. రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్‌కి నోటీసులు



నూతన షాదీఖానా నిర్మాణంలో చేసిన పనులకు పూర్తిగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో అతడికి పలుమార్లు నోటీసులు ఇచ్చాం. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

– రిజ్వాన్, పీఆర్ ఏఈ, దుబ్బాక

ప్రభుత్వ సహకారం అవసరం



షాదీఖానాలో డైనింగ్, కిచెన్, మరమ్మతులకు మరిన్ని నిధులు అవసరం. ప్రభుత్వం సహకరించి మరికొన్ని సదుపాయాలు కల్పించాలి. అలా చేస్తే తిగిరి అందులోనే శుభకార్యాలను నిర్వహించుకుంటాం.

– మహ్మద్ ఖలీల్, మసీద్ కమిటీ అధ్యక్షుడు, దుబ్బాక

అసంపూర్తిగా మరో షాదీఖానా

స్థానిక బస్టాండ్ వెనుక బైపాస్ రోడ్డు సమీపంలో మరో షాదీఖానా నిర్మాణానికి 2018, జూన్‌లో రూ.కోటి ఎస్ఎస్ నిధులతో మాజీ మంత్రి హరీశ్‌రావు పనులు ప్రారంభించారు. గడిచిన ఆరేళ్లలో దాదాపు రూ.40లక్షలు వెచ్చించి చుట్టూ గోడలు నిర్మించారు. మిగిలిన పనులు అలాగే ఉన్నాయి. చేసిన పనికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులేత్తేశాడు. ఫలితంగా నాలుగేళ్లుగా షాదీఖానా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం అక్కడికి వెళ్లేందుకు సరైన దారిలేదు. చుట్టూ ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. షాదీఖానాల నిర్వహణను మెరుగుపరిచి అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తిచేయాలని మైనారిటీ ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గజ్వేల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దుబ్బాకటౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1978–79లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సరిగ్గా 46యేళ్ల తర్వాత వారంతా ఆదివారం కలుసుకొని సందడి చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన ఆనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వివిధ కారణాలతో మృతి చెందిన 14మంది మిత్రులకు నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి రచించిన 'స్నేహానికన్నా వేరేదీ.. లేదులే' అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు 48 మంది పూర్వ విద్యార్థులు బస్టాండ్ నుంచి స్కూల్ వరకు స్నేహయాత్ర చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

సన్మానించారు.

సరస్వతీ విద్యాలయంలో ..

దుబ్బాకలోని సరస్వతీ విద్యాలయంలో 1994–95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకొని సందడి చేశారు. వారు మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు



సరస్వతీ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో..

టాలెంట్ టెస్టులు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ జోగు ప్రభుదాస్, హెచ్ఎం ధర్మారెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్: గజ్వేల్‌లోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో 1998–99బ్యాచ్‌కు చెందిన పదో విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు పాఠాలను బోధించిన గురువులను



దుబ్బాకటౌన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1978-79 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

600 మందికి వైద్య పరీక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేటలో ఆదివారం బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 600మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, వైద్యులు మణిదీప్‌రావు, సాయి, రవితేజగౌడ్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే



మహిళతో మాట్లాడుతున్న నాగరాజు

కొండపాక(గజ్వేల్): రేషన్‌కార్డుల సర్వే పారదర్శకంగా జరగాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు సూచించారు. మండల పరిధిలోని దుద్దెడలో జరుగుతున్న సర్వేను ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి తప్పులు జరుగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ నాయక్, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

దౌల్తాబాద్(దుబ్బాక): పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా పేదలకు సేవ చేస్తానన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్, శేఖర్ రెడ్డి, దేవేందర్, చిత్తారి గౌడ్, శ్రీనివాస్, శివ, యాదగిరి, ప్రకాశ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): హుస్నాబాద్‌లో ఆదివారం జరిగిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ సమావేశంలో మండలానికి చెందిన పలువురికి చోటు కల్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా పుల్లూరి ప్రభాకర్, బెజుగం సురేశ్ కుమార్‌లతో పాటు యూత్ రాష్ట్ర కార్యదర్శిగా చింతకింది శ్రీనివాస్‌గుప్తాను ఎంపిక చేశారు.

నిబంధనలతో ప్రమాదాలు దూరం

పోలీసు అధికారులు

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలల్లో భాగంగా పోలీసు అధికారులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ఆదివారం కూడా కొనసాగాయి. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి నడపవద్దని చెప్పారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక)/కొండపాక(గజ్వేల్)/మిరుదొడ్డి(దుబ్బాక): నర్సాపూర్ చౌరస్తా వద్ద టూటౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేందర్

ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని చెప్పారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు, తొగుట మండలంలోని రాంపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ రవికాంత్‌రావు, కొండపాక



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లిలో అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ హరీశ్

మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలోని కొమురవెల్లి కమాన్ వద్ద కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో భూంపల్లి ఎస్ఐ హరీశ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు తప్పని తిప్పలు



రంగుమారిన పుష్కరిణిలో నీరు



ఆలయ పరిసరాలలో దర్శనమిస్తున్న చెత్త

- అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో మొదటి ఆదివారం భక్తులకు తిప్పలు తప్పలేదు. పవిత్రంగా భావించే స్వామి వారి పుష్కరిణిలో నీరు రంగు మారడంతో భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కోడెల స్తంభం సమీపంలో డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లింది. దీంతో భక్తులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. అలాగే పరిసరాలు కూడా అశుభ్రంగా దర్శనమిచ్చాయి. అధికారులు స్పందించి మెరుగైన ఏర్పాట్లు చేయాలని పలువురు భక్తులు కోరారు.

పూలే గురుకులంలో 'ఖేలో ఇండియా'



క్రీడాకారులతో ఆనందరావు, ఫల్గుణ తదితరులు

బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

వర్గల్(గజ్వేల్): మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల కళాశాల వేదికగా తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అస్మిత ఖేలో ఇండియా అండర్–17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కల్నల్ ఆనందరావు, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీపీ ఫల్గుణ ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలలో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా స్వీకరించాలన్నారు. మానవసంబంధాలు మెరుగుపరచుకునేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. పోటీలు నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ క్లబ్‌ను అభినందించారు. టోర్నీలో ఆరు జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ రంగారెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు గణేశ్, సుగుణాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, చక్రపాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న వెంకట్‌స్వామి గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రొటోకాల్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్ మండిపడ్డారు. అక్బర్‌పేట–భూంపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన మంత్రి కొండా సురేఖ కార్యక్రమాలపై ప్రొటోకాల్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. అభివృద్ధిని అడ్డుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్, సుమలత, లోకేశ్‌గౌడ్, ప్రభాకర్‌చారి, సురేందర్‌రెడ్డి, నరేశ్, స్వామి, చందు, యాదగిరి, మహిపాల్, రమేశ్, హనుమంతరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు అర్థరహితం



రాములుగౌడ్

గజ్వేల్‌రూరల్: పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని, ఏనాడూ ప్రజా సమస్యలను పట్టించుకోని ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం అర్థరహితమని పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌కు ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ ఏనాడూ తన నియోజకవర్గ సమస్యలను పట్టించుకోలేదన్నారు.

ఎమ్మెల్యే మాటలు సరికాదు

దుబ్బాక: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ దుబ్బాక అధికార ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. మంత్రి సురేఖ కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నంచేసి, సీఐ శ్రీనివాస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పోలీస్‌స్టేషన్లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గూండా రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్, భరత్, సురేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, సాయి, రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

దైవానికి చేరువచేసేది సేవ, ప్రేమ, త్యాగమే..

విజయదుర్గా ట్రస్టు అధ్యక్షుడు హరినాథ శర్మ

కొండపాక(గజ్వేల్): సేవ, ప్రేమ, త్యాగం లాంటి గుణాలే మనిషిని దైవానికి చేరువచేస్తాయని విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెప్పెల హరినాథ శర్మ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోని మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గా పీఠాధిపతి వెదురుపాక గాడ్ 89వ జన్మదిన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం కృషిచేస్తున్న భానుప్రకాశ్‌కు విజయదుర్గా ధార్మిక పురస్కార్ అందజేశామన్నారు. అనంతరం ప్రముఖ కవయిత్రి సరస్వతి మాట్లాడారు. అంతకు ముందు నిర్వహించిన శిబిరంలో వైద్యుడు రవిబాబు సుమారు 300 మందికి వైద్య పరీక్షలుచేసి మందులు అందజేశారు. ట్రస్టు సభ్యులు రవీందర్, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ధార్మిక పురస్కార్‌ను అందజేస్తున్న హరినాథశర్మ

దండగ అన్నారు.. మరి నీరెక్కడిది?

- హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకొనేది లేదు
- సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి

సిద్దిపేటజోన్: కాళేశ్వరం ప్రాజెక్టులు దండగ, కమిషన్ల కోసమే అని విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు నీరు వదలాడానికి ఫొటోల కోసం పోటీలు పడ్డారని సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి సురేఖ రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ ద్వారా సాగునీరు విడుదల చేయడం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని వాస్తవాలను ఒప్పుకోవడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు స్వల్పకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేశారని గుర్తుచేశారు. ప్రజలకు మాయ



మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి

మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా మార్పు రావాలని లేనిపక్షంలో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదయ్య, జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు అల్లం ఎల్లం, మోహన్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.